సాక్షి
వికారాబాద్
శనివారం ; 11 ; అక్టోబర్ ; 2025



పైన పచారీ.. లోన లిక్కర్

కొడంగల్ నియోజకవర్గంలో బెల్టు దందా జోరుగా సాగుతోంది. కిరాణా దుకాణాల్లో విరివిగా మద్యం లభ్యమవుతోంది. 8లో▸



అక్రమ కట్టడాల కూల్చివేత

తాండూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 8లో▸



నకిలీలకు చెక్!

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన సంస్కరణలను అమలు చేయనుంది. 9లో▸

న్యూస్‌రీల్

మోమిన్‌పేట ఏఓగా రామకృష్ణారెడ్డి



మోమిన్‌పేట: మండల వ్యవసాయాధికారిగా రామకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన జయశంకర్ నూతన ఫెర్టిలైజర్ దుకాణం లైసెన్స్ కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. దీంతో శంకర్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి ఇక్కడికి బదిలీ చేశారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

- ఆశావర్కర్ల డిమాండ్
- ధారూరు పీహెచ్‌సీ వద్ద ధర్నా



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ధారూరు: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో స్వీపర్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని, జీపీఎస్ ఆఫ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే అదనపు పని విధానం తొలగించాలని, ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధారూరులో సబ్ సెంటర్ ఏర్పాటు చేసి 24 గంటల పాటు వైద్యుడు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఏడాదికి మూడు జతల యూనిఫారాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్ హజ్రకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి: రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో బీసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం సరైన పద్ధతి పాటించలేదని పేర్కొన్నారు. ఇందుకే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీలను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు అవుసుల కిశోర్‌చారి, నాయకులు దేవదాసు, రాజేందర్‌గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గిరిష్ కొఠారి, మల్లికార్జున్, వేణుగోపాల్, వెంకటేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

లక్ష గాంధీ విగ్రహాల సేకరణ షురూ

హయత్‌నగర్: మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేయడంలో భాగంగా పలు రూపాల్లో ఉన్న లక్ష గాంధీ విగ్రహాలను సేకరించే కార్యక్రమం చేపట్టినట్టు గ్లోబల్ ఫ్యామిలీ వ్యవస్థాపక అధ్యక్షుడు గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని కుంట్లూర్‌లో గల గాందేయన్ కళాశాలలో శుక్రవారం లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. లక్ష గాంధీ విగ్రహాలను సేకరించి ప్రజలకు అందించడం ఒక ఉద్యమంగా చేపట్టామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు గాంధీ మార్గమే ఉత్తమమైనదని పేర్కొన్నారు. గాంధీ తత్వాన్ని యువతకు, రాబోయే తరాలకు అందించడమే లక్ష్యంగా విగ్రహాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలతో గాంధీ విగ్రహాల సేకరణ అనే అక్షరమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ గాంధారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

ఆగుతూ.. సాగుతూ!

మున్సిపాలిటీల్లో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

- కానరాని సిగ్నల్ వ్యవస్థ
- ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలు
- ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు
- కలగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
- లా అండ్ ఆర్డర్ పోలీసులపైనే భారం

వికారాబాద్: ట్రాఫిక్ సమస్య జిల్లాలో రోజురోజుకూ జటిలమవుతోంది. ఈ సమస్య ఐదారేళ్ల క్రితమే ప్రారంభమైనా దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపల్ కేంద్రాల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు లేకపోవడం పెద్ద సవాల్‌గా మారింది.పోలీసు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా ట్రాఫిక్ ఠాణాలు మంజూరు కావడం లేదు. జిల్లా నేతలు పట్టించుకోకపోవడంతో వినతులు బుట్టదాఖలవుతున్నాయి. ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడం ఇబ్బందులు తెస్తోంది. జిల్లా కేంద్రం వికారాబాద్‌లోని పలు చోట్ల గతంలో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అవి కొద్ది రోజులకే మూలకు చేరాయి. ఫుట్‌పాత్‌లు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. వ్యాపారులు రోడ్లపైనే తోపుడు బండ్లు ఉంచడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. లా అండ్ ఆర్డర్ పోలీసులపై అదనపు భారం పడుతోంది. జిల్లాలో మొత్తం 2.50 లక్షల వాహనాలు ఉండగా వాటిలో 18వేల పైచిలుకు ట్యాక్సీ ప్లేట్‌కు సంబంధించినవే. వీటితోపాటు నిత్యం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలు వేలల్లోనే ఉంటాయి.

ఆ మున్సిపాలిటీల్లో..

జిల్లా కేంద్రం వికారాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ఎన్టీఆర్, బీజేఆర్ చౌరస్తాల్లో రద్దీ విపరీతంగా పెరిగి పోయింది. రామయ్యగూడ మార్గంలో.. ఆలంపల్లి రోడ్డులోని పెట్రోల్ బంక్ చౌరస్తాలో, మహాశక్తి థియేటర్ వద్ద, గంగారం చౌరస్తాలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్స్, కళాశాలల విద్యార్థులు పలుచోట్ల రోడ్డు దాటాలంటేనే జంకుతున్నారు. ఎస్‌బీఐ, ఆలంపల్లి తదితర చోట్ల రోడ్ల పక్కనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాండూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, చించోలి చౌరస్తా, బస్టాండ్ తదితర చోట్ల ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. పరిగి బస్టాండ్, అంబేడ్కర్, వివేకానంద, బాహర్‌పేట, కొడంగల్ చౌరస్తాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. మున్సిపల్ కేంద్రాల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో రోడ్ల పక్కనే నిలపాల్సి వస్తోందని అంటున్నారు. పార్కింగ్ స్థలాల కేటాయింపులో నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు మాత్రం వేలకు వేలు చలానాలు బాదుతున్నారని వాహనదారులు వాపోతున్నారు.

అర్జీలు బుట్టదాఖలు

ట్రాఫిక్ సమస్యకు అనేక కారణాలని పోలీసులు పేర్కొంటున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు పట్టణాల్లోకి భారీ వాహనాలు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే బైపాస్ లేదా రింగ్ రోడ్డు వేయాలంటున్నారు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వికారాబాద్, పరిగి, తాండూరు మున్సిపల్ కేంద్రాల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం దశాబ్ద కాలంగా పోలీసు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా ఫలితం కనిపించడం లేదు. మరో పక్క హైదరాబాద్ – బీజాపూర్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మన్నెగూడ, కొడంగల్ సమీపంలో రెండు చోట్ల హైవే పెట్రోలింగ్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. జిల్లాకు మూడు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు అవసరమని అధికారులు గుర్తించారు. ఇవి మంజూరైతే ఒక్కో స్టేషన్‌కు ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐలతో పాటు 25 మంది పోలీసులను కేటాయిస్తారు. దీంతో సమస్య చాలా వరకు పరిష్కారమైనట్లే.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> 
>
> జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు లేవు. సిబ్బందిని కూడా కేటాయించలేదు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ కొంత ఇబ్బందిగా మారింది. అయినా సమస్య లేకుండా చూస్తున్నాం. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో ట్రాఫిక్ ఠాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రావాల్సి ఉంది. ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలి.
>
> – నారాయణరెడ్డి, ఎస్పీ

బానిసలుగా ఉండాల్సిందేనా?



తాండూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

- రిజర్వేషన్లు అడ్డుకోవడంలో అగ్రవర్ణాల కుట్ర
- చోద్యం చూస్తున్న బీఆర్ఎస్, బీజేపీ
- హైకోర్టులో పిటిషన్ వేయకుండా సీఎం అడ్డుకోవాల్సింది
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్
- తాండూరు పట్టణంలో ఆందోళన

తాండూరు టౌన్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంలో అగ్రవర్ణాల కుట్ర దాగి ఉందని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల చెప్పుచేతల్లో పనిచేస్తూ బహుజనులు బానిసలుగానే బతకాలా అని ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అడ్డు తగిలింది అగ్రవర్ణాల వారే అన్నది ప్రజలందరికీ తెలుసన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చోద్యం చూస్తూ కూర్చున్నాయని, నిజంగా వారికి బీసీలపై ప్రేమ ఉంటే హైకోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదని దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పుకున్న సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయకుండా అడ్డుకోలేక పోవడం విడ్డూరమన్నారు. గతంలో బీఆర్ఎస్ కూడా 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించిందన్నారు. రాజకీయ పార్టీలన్నీ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ, బహుజనులకు అధికారం దక్కకుండా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో నాయకులు సయ్యద్ షుకూర్, వెంకటేష్, అనిత, మంజుల, విజయలక్ష్మి, జగదీశ్వరి, శివలీల, బస్వరాజ్, నరేందర్, కృష్ణ, పరమేష్, రాము, రమేష్, రాజు, బాబు, యాసర్, జావీద్, జుంటుపల్లి వెంకట్, శివ, అరుణ్‌రాజ్, సురేష్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం కుట్ర

- సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

పరిగి: బీసీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, జాతీయ కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, ఈ బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇదే అంశంపై పరిగి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన బిల్లును కేంద్రానికి పంపితే ఆమోదం తెలపకుండా అన్యాయం చేసిందన్నారు. ఆ బిల్లును వెంటనే ఆమోదింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, నర్సింహులు, వెంకటేశ్వరస్వామి, గోపాల్, నరేందర్, మైపాల్ తదతరులు పాల్గొన్నారు.

గొల్లచెరువు కబ్జాలపై చర్యలేవి?

- మినీ ట్యాంక్‌బండ్ పనులను సత్వరం పూర్తి చేయాలి
- బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం



గొల్లచెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ పరిధిలోని గొల్ల చెరువు(మినీ ట్యాంక్‌బండ్) సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాలు రూ.12 కోట్లతో గొల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా సుందరీకరిస్తామని చెప్పి మాట తప్పాయన్నారు. మంజూరైన నిధులు ఏమేరకు ఖర్చు చేశారో, ఇంకా ఏఏ పనులు చేయాల్సి ఉందో చెప్పాలన్నారు. చెరువు కట్ట పరిస్థితి అధ్వానంగా తయారయ్యిందని, వాకింగ్ ట్రాక్ పూర్తిగా పాడైపోయిందన్నారు. చెరువులో గుర్రపు డెక్క మొక్కలు విపరీతంగా పెరిగాయన్నారు. సుమారు 11 ఎకరాల చెరువు శిఖం ఆక్రమణలకు గురైందని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తెచ్చినా కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేని ఆరోపించారు. వెంటనే స్పందించి చెరువు కట్ట నిర్మాణం, లైటింగ్ వ్యవస్థ, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను పూర్తి చేసి, మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజు, ప్రకాష్, దోమ కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో సత్తా చాటండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రోబోటిక్స్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: విద్యార్థులను సాంకేతిక రంగంపై అడుగులు వేయించడమే లక్ష్యంగా రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్‌ఐఏ కార్యక్రమం విజయవంతమైందన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సంగం లక్ష్మీబాయి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను వీక్షించారు. పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లాలోని ఐదు పాఠశాలల్లో రోబోటిక్స్ వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు తెలిపారు. 568 మంది విద్యార్థులు (453 మంది బాలికలు, 115 మంది బాలురు) పాల్గొన్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. త్వరలో ప్రతి స్కూల్‌కి రోబోటిక్స్ కిట్లు అందుతాయని, వాటితో నూతన ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సోహం అకాడమీ వ్యవస్థాపకులు కొమరగిరి సహదేవ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జేశ్వంత్, పాఠశాల ప్రిన్సిపాల్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ ప్రతీక్‌జైన్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌తోపాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేశారు. డీఆర్‌ఓ మంగీలాల్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పార్కు స్థలం కబ్జాపై హైడ్రా కొరడా



అక్రమ నిర్మాణం కూల్చివేస్తున్న సిబ్బంది

హయత్‌నగర్: పార్కు స్థలం ఆక్రమణపై హైడ్రా కొరడా ఝులిపించింది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని శ్రీ లక్ష్మి గణపతి కాలనీలోని సుమారు 700 గజాల స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేసి స్థలాన్ని విడిపించారు. తట్టిఅన్నారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 76/ఎలో 9.24 ఎకరాల భూమిలో గతంలో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. లేఅవుట్‌లో సుమారు 2,800 గజాల ఖాళీ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం వదిలేశారు. ఇందులో 700 గజాల స్థలం పురాతన బావి దగ్గర ఉంది. కొంత కాలంగా ఈ స్థలంపై కన్నేసిన స్థానిక నాయకుడు సుమారు 270 గజాలు కొన్నట్లు డాక్యుమెంట్లు సృష్టించి ప్రహరీ నిర్మించాడు. స్థలం ఆక్రమణపై కాలనీవాసులు కొంత కాంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో గత మార్చిలో ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వివరాలు సేకరించి పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. దీంతో శుక్రవారం ఉదయం జేసీబీలతో అక్కడికి చేరుకుని అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించారు.

పొలాలు పోతే బతికేదెట్లా?

- అన్నదాతల ఆవేదన
- రేడియల్ రోడ్డుపై వ్యతిరేకత



షాబాద్ శివారులో రోడ్డు సర్వే పనులు చేస్తున్న కన్సల్టెన్సీ సిబ్బంది

కొందుర్గు: 'అభివృద్ధి పనుల పేరిట చేపట్టనున్న రోడ్డు నిర్మాణం.. నేల తల్లిని నమ్ముకున్న మాకు శాపంగా మారింది. జీవనోపాధి కోల్పోతాం. రోడ్డున పడతాం' అని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డును కలిపేందుకు నిర్మించతలపెట్టిన రేడియల్ రోడ్డుకు ఓ వైపు ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ.. శుక్రవారం సర్వే పనులు చేస్తుండగా.. సమీపాన సాగుభూములు కలిగిన కర్షకులు.. ఆందోళన చెందారు. పొలాలు పోతే బతికేదెట్లా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమ పొలాల నుంచి రోడ్డు వెళ్లకుండా చూడాలని కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ అజాంఅలీ ఖాన్‌ను వివరణ కోరగా.. రోడ్డు మార్కింగ్ చేస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

మూడు ప్రతిపాదనలు సిద్ధం

సర్వే పనులు మొదలు పెట్టిన కన్సల్టెన్సీ ప్రతినిధులు మాట్లాడుతూ..షాబాద్ మండల కేంద్రం మీదుగా చుక్కమెట్టు, ముట్పూర్, ఉమ్మెంత్యాల నుంచి పరిగి మండలం గూడూరు వరకు 55 కిలో మీటర్ల వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. అయితే ఈ రహదారికి సంబంధించి మూడు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వం ఏదైనా ఒక దానిని ఆమోదం తెలపవచ్చన్నారు.



ముట్పూర్ శివారులో రోడ్డు మార్కింగ్‌ను పరిశీలిస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

వ్యక్తిపై చర్యలకు డిమాండ్



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: లంబాడాలను కించపరిచేలా మాట్లాడిన తుడుందెబ్బ నేత మైపతి అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలిపారు. అయినప్పటికీ.. అరుణ్‌కుమార్.. భద్రాచలం ఆత్మగౌరవ సభలో లంబాడ ఆడబిడ్డలను అగౌరపరిచేలా మాట్లాడారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్ రాథోడ్, ప్రకాష్ నాయక్, గోపాల్ నాయక్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో నిర్వాహకులు

కుల్కచర్ల: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కుల్కచర్ల విద్యార్థులు ప్రణిత, ఐశ్వర్యలు సత్తాచాటారు. ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారని పీడీ ఖాజ తెలిపారు. శుక్రవారం పరిగి ఇండోర్ స్టేడియంలో.. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ఆటగాళ్లను ప్రోత్సహించి, జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేస్తామన్నారు. పీఈటీలు ప్రవీణ్, కేశవులు, క్రీడాకారులు సంతోష్, కుమ్మరి స్వామి పాల్గొన్నారు.

బైక్‌పై.. నలుగురు మైనర్లు

పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని పెద్దలు



ఒక బైక్‌పై దూసుకుపోతున్న బాలలు

దోమ: బాలబాలికలకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసుల హెచ్చరికలను పెద్దలు పట్టించుకోవడం లేదు. ఇందుకు నిదర్శనం.. ఒక ద్విచక్ర వాహనంపై ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా నలుగురు మైనర్లు దూసుకు పోతున్న చిత్రమే. వివరాలు ఇలా ఉన్నాయి. దోమ ఠాణా పరిధిలో శుక్రవారం నలుగురు బాలలు నిబంధనలకు విరుద్ధంగా బైక్‌పై ప్రయాణం సాగించారు. వారిని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, పిల్లలకు బైక్‌లు ఇవ్వద్దని చెబుతున్నా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు స్పందించి, ఇలాంటి వాటిపై పెద్దలకు అవగాహన కల్పించి, ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనం బోల్తా, ఒకరి మృతి

పరిగి: బొలేరో వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి ఖుదావాన్‌పూర్ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రావులపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(34) మరో ముగ్గురుతో కలిసి చిట్యాల నుంచి రావులపల్లికి బొలేరోలో వస్తున్నారు. ఈ క్రమంలో వాహనం జైంట్ క్రాస్ విరిగి, అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందగా.. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

లక్ష గాంధీ విగ్రహాల సేకరణ షురూ



గాంధీ విగ్రహాల ప్రదర్శన

హయత్‌నగర్: మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేయడంలో భాగంగా పలు రూపాల్లో ఉన్న లక్ష గాంధీ విగ్రహాలను సేకరించే కార్యక్రమం చేపట్టామని గ్లోబల్ ఫ్యామిలీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌లో గల గాందేయన్ కళాశాలలో శుక్రవారం విగ్రహాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాలను సేకరించి ప్రజలకు అందించడం ఉద్యమంగా చేపట్టామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు గాంధీ మార్గమే ఉత్తమమైనదని పేర్కొన్నారు. గాంధీ తత్వాన్ని యువతకు, రాబోయే తరాలకు అందించడమే లక్ష్యంగా విగ్రహాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలతో గాంధీ విగ్రహాల సేకరణ అనే అక్షర మాలను ప్రదర్శించారు.

పైన పచారీ.. లోన లిక్కర్

వైన్‌షాపుల్లో కొరత..
- కిరాణా దుకాణాల్లో అడిగినంత
- మద్యం వ్యాపారులతో లింక్
- పల్లెల్లో జోరుగా బెల్టు దందా
- పట్టించుకోని ఆబ్కారీ అధికారులు



కిరాణ దుకాణంలో మద్యం సీసాలు(ఫైల్)

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలో బెల్టు దందా జోరుగా సాగుతోంది. మద్యం షాపుల్లో కొరత ఉన్నా.. కిరాణా దుకాణాల్లో విరివిగా లభ్యం అవుతోంది. ఇతర సామగ్రి కంటే.. లిక్కర్‌నే ఎక్కువగా విక్రయిస్తున్నారని, అదికూడా అధిక ధరలకు అమ్ముతూ.. మందుబాబుల జేబుకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటోందని, అయినా.. ఆబ్కారీ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా బాదుడు

బెల్ట్ షాపుల్లో మద్యం క్వాటర్ బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే.. అదనంగా రూ.20 తీసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో, అత్యవసరంగా మద్యాన్ని కొనుగోలు చేసేవారు అడిగినంత ఇస్తున్నారు. దీంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. చిప్ లిక్కర్ నుంచి బ్రాండెడ్ మద్యం వరకు ప్రతి బాటిల్‌పై రూ. 20 నుంచి రూ. 50 వరకు వసులు చేస్తున్నారు.

దుద్యాల్‌లో 200లకు పైగా..

నియోజకవర్గ పరిధి పల్లెల్లో బెల్ట్ షాపులు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాల్లోనూ అధికంగానే ఉన్నాయి. ఒక్క దుద్యాల్ మండలంలో సుమారు 200లకు పైగా నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నడుస్తున్నాయి. ఇలా నిరంతరం మద్యం లభ్యం కావడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. నిత్యం మత్తులో జోగుతున్నారు. ఇది ఘర్షణలకు దారి తీస్తోంది.

కొరత సృష్టిస్తూ..

బెల్టు షాపుల నిర్వాహకులు.. మద్యం వ్యాపారులతో కుమ్మక్కు అయ్యారు. వారికి కావాల్సిన సరుకు ఇస్తూ.. పల్లెలకు తరలిస్తున్నారు. అనంతరం వైన్ నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టిస్తూ మందుబాబుల జేబులు కొల్లగొడుతున్నారు. మద్యం స్టాక్ లేదని, ఫుల్ బాటిళ్లు మాత్రమే ఉన్నాయని పేర్కొంటూ.. ఆఫ్, ఫుల్లు సీసాలను అంటగడుతున్నారు. దీంతో కొద్దిగా తాగే అలవాటు ఉన్న వారు సైతం.. అధికంగా మద్యం తాగుతూ.. ఒళ్లు హూనం చేసుకొంటున్నారు.

> **ఫిర్యాదు చేస్తే..**
>
> వైన్ షాపుల్లో అన్ని రకాల మద్యం అందుబాటులో ఉంది. కొనుగోలు దారులను.. వ్యాపారులు ఇబ్బందులకు గురిచేయొద్దు. వారు అడిగింది ఇచ్చేయండి. కొరత సృష్టిస్తే.. చర్యలు తప్పవు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందినా తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – వెంకటేష్, ఎక్సైజ్ సీఐ, కొడంగల్

రాకపోకల పునరుద్ధరణ



నాగసమందర్- రుద్రారం గ్రామాల మధ్య రాకపోకలకు అనువుగా మారిన వంతెన రోడ్డు

కోట్‌పల్లి అలుగు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి

ధారూరు: మండల పరిధిలోని రుద్రారం- నాగసమందర్ గ్రామాల మధ్య కోట్‌పల్లి అలుగు వద్ద రాకపోకలను పునరుద్ధరించారు. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టు నుంచి పారి అలుగు ఉధృతికి కల్వర్టు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. రాతిగుండ్లు తేలి, పెద్దపెద్ద గుంతలు పడటంతో ఈ మార్గం మీదుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మట్టి నింపి తాత్కాలిక మరమ్మతులు చేసిన ఆర్అండ్‌బీ అధికారులు శుక్రవారం నుంచి రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు ప్రవహించే రోడ్డు మీదుగా వాహనాలు వెళ్లేందుకు అనువుగా మార్చారు. దీంతో ఈ రూట్‌లో వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పాయి. దూరభారం కూడా తప్పిందని పలువురు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తడి పొడి చెత్త ఎక్కడ?

- వర్మీ కంపోస్టు తయారీ ఎంత?
- గ్రామ అధికారులపై డీపీఓ సురేష్ మోహన్ ప్రశ్నల వర్షం



గ్రామ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ సురేష్ మోహన్

నందిగామ: 'గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎక్కెడెక్కడ నిల్వ ఉంచారు. ఎంత మేర వర్మీ కంపోస్టు తయారు చేశారు' అని డీపీఓ సురేష్ మోహన్.. రంగాపూర్ గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంపీఓ తేజ్ సింగ్‌లను ప్రశ్నించారు. దీనికి వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగాపూర్‌లో కంపోస్టు యార్డును శుక్రవారం డీపీఓ తనిఖీ చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులైన గ్రామ కార్యదర్శి, ఎంపీఓపై మండిపడ్డారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, కంపోస్టు యార్డుకు తరలించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వారంలోపు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల బిజీ కారణంగా కొంత నిర్లక్ష్యం జరిగిందని, వారం రోజుల్లో కంపోస్టు యార్డుల్లో తడి పొడి చెత్తను వేర్వేరుగా వేసి, కంపోస్టును తయారు చేస్తామని ఎంపీఓ తేజ్ సింగ్.. డీపీఓకు వివరణ ఇచ్చారు.

తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు యత్నం

నలుగురు అరెస్టు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డులో తెలంగాణ ఉద్యమకారుల హామీలు పొందుపరచలేదని ఆరోపిస్తూ వినతిపత్రం ఇవ్వడంతో పాటు తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు వెళ్లిన నలుగురు తెలంగాణ ఉద్యమకారులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మన తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమకారుల జేఏసీ నేతలు తెలంగాణ కొమురయ్య, శ్యామా అంజిరెడ్డి, మచ్చ సోమనారి, చెరుకుపల్లి నాగేశ్వరరావు తదితరులు శుక్రవారం ఉదయం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ లోనికి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తామంటూ పోలీసులకు చెప్పగా అనుమతించలేదు. తాము వినతిపత్రంతో పాటు తమ హామీలు నెరవేర్చని తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు ప్రయత్నించామని, తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవాన్ని కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు.

బాలిక సాహసం.. ఉడాయించిన దొంగ

సాక్షి, సిటీబ్యూరో: తమ పొరుగింట్లో చోరీకి యత్నించిన దొంగను ఓ బాలిక తరిమికొట్టింది. దొంగతనాన్ని నివారించి అందరి ప్రశంసలు అందుకుంది. వివరాల్లోకి వెళ్తే..చింతల్, భగత్‌సింగ్ నగర్, రోడ్ నంబర్ 12లోని ఓ ఇంట్లో కావలి భవానీ అనే 13 ఏళ్ల బాలిక కుటుంబంతో కలిసి నివసిస్తోంది. తమ కింద పోర్షన్‌లో ఉమా మహేశ్వరి, చంద్రశేఖర్ దంపతులు నివసిస్తుండగా..వారు గురువారం రాత్రి బయటకు వెళ్లడం చూసి ఓ 20 ఏళ్ల యువకుడు దొంగతనం కోసం ఇంట్లోకి ప్రవేశించాడు. కిందింట్లో అలికిడి గమనించిన భవానీ అక్కడికి వెళ్లి ఎవరు నువ్వు అని నిలదీయడంతో యువకుడు బయటకు పరుగెత్తాడు. భవాని అంతటితో వదిలి పెట్టకుండా కేకలు పెడుతూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తూ దుండగుడిని వెంబడించింది. వీధి చివర ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ వరకు తరుముతూ వెళ్లింది. సీసీ కెమెరా రికార్డు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులతోపాటు కాలనీ వాసులు భవానిని ప్రశంసించారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మీర్‌పేట: సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పురపాలిక కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. తుర్కయంజాల్ పట్టణంలో ఈ నెల 14,15న నిర్వహించనున్న సభలో.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చిస్తామని తెలిపారు. కావున కార్మికులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిచారి, కమలమ్మ, లలిత, బావమ్మ, బుచ్చమ్మ, స్వరూప, పున్నమ్మ, శోభ, శ్రీకాంత్, సతీష్, సత్తయ్య పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

కొడంగల్ రూరల్: ఆలయ ఆవరణలో గది నిర్మాణానికి దాత శివకుమార్‌గుప్తా సాయం అభినందనీయమని గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు హన్మయ్య, సాయిరెడ్డి, మారుతి, శ్రీశైలం, బీరప్ప, రాములు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన గదికి వాసవి క్రషర్స్ యజమానులు శివకుమార్‌గుప్తా వాసవి రెడీ మిక్స్ కాంక్రీట్ ద్వారా స్లాబ్, గది నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో భక్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

బీజేపీ నాయకుడి హఠాన్మరణం



మల్లప్ప(ఫైల్)

బషీరాబాద్: మండలంలోని జీవన్గీకి చెందిన బీజేపీ నాయకుడు చామకూర మల్లప్ప(50) హఠాన్మరణానికి గురయ్యారు. గురువారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం తాండూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈనెల 28న తన కొడుకు వసంత్‌కుమార్‌ను ఉన్నత చదువుల కోసం జర్మనీలోని బెర్లిన్‌కు పంపించే ఏర్పాట్లలో ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది. మల్లప్ప భార్య స్వరూప 2014లో జీవన్గీ ఎంపీటీసీగా పనిచేశారు. కూతురు వందన ఫిజియోథెరపీ మూడో సంవత్సరం చదువుతోంది. మల్లప్ప గతంలో బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉప్పరి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ కులకర్ణి, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాఘవేందర్‌తో, కాంగ్రెస నాయకులు మాణిక్‌రెడ్డి, నర్సిరెడ్డి శుక్రవారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కిక్కులేని లిక్కర్!

రంగారెడ్డి జిల్లాలో 249 మద్యం దుకాణాలు
- టెండర్లు ఆహ్వానించిన ప్రభుత్వం
- ఆసక్తి చూపని వ్యాపారులు
- ఇప్పటివరకు వచ్చింది 700లోపే దరఖాస్తులు
- లైసెన్స్ ఫీజు.. గుడ్‌విల్.. నిర్వహణ ఖర్చు ఎఫెక్ట్
- గతంతో పోలిస్తే ఆశించిన స్థాయిలో రాని అప్లికేషన్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లిక్కరుకు ఆశించిన కిక్కు దక్కడం లేదు. భూముల క్రయవిక్రయాలు తగ్గిపోవడం.. చేతిలో ఆశించిన స్థాయిలో డబ్బులేక పోవడం.. ప్రభుత్వం లైసెన్స్ ఫీజును భారీగా పెంచడం .. నిర్వహణ ఖర్చులు రెట్టింపు కావడం .. వెరసి మద్యం టెండర్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మద్యం దుకాణాలకు ప్రభుత్వం ఇటీవల టెండర్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. తెలంగాణలోనే అత్యధిక లిక్కర్ అమ్మకాలు జరిగే ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడం అబ్కారీ శాఖను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టెండర్లు పిలిచాం.. దాఖలు చేయండి అంటూ మద్యం వ్యాపారులను అభ్యర్థిస్తుండడం విశేషం.

అడ్డుకుంటున్న సిండికేట్లు

శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 111 మద్యం దుకాణాలు ఉండగా, సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో 138 ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్ జిల్లాలో 59 దుకాణాలున్నాయి. 2023 ఆగస్టులో జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌లోని షాపుల సంఖ్యతో పోలిస్తే.. 2025 సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో కొత్తగా 19 దుకాణాలు వచ్చి చేరాయి. గతంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ జోన్ నుంచి



10,994 దరఖాస్తులు రాగా శంషాబాద్‌లో ఎక్సైజ్ జోన్ నుంచి మరో 10,611 అందాయి. దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.432.10 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావించింది. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. 249 షాపులకు.. సంఖ్య ఇప్పటి వరకు 700 మించలేదు. ఇదిలా ఉండగా సరూర్‌నగర్, శంషాబాద్, గచ్చిబౌలి, హయత్‌నగర్ కేంద్రంగా వెలసిన పలు షాపులను ఎలాగైనా చేజిక్కించుకోవాలని పలువురు వ్యాపారులు భావిస్తున్నారు. అంతా సిండికేట్‌గా ఏర్పడి.. కొత్తగా మద్యం వ్యా పారంలోకి వచ్చే వాళ్లను టెండర్‌లో పాల్గొనకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం.

గుదిబండగా గుడ్‌విల్స్

గతంతో పోలిస్తే ప్రస్తుతం కొన్ని ఏరియాల్లో షాపుల సంఖ్య పెరిగింది. లైసెన్సు ఫీజును కూడా రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచారు. దీనికి తోడు ఎక్సైజ్‌కు ప్రతి నెలా గుడ్‌విల్ పేరుతో భారీగా చెల్లించుకోవాల్సి వస్తోంది. ఓపెన్ టెండర్‌లో పాల్గొని మద్యం దుకాణాన్ని దక్కించుకున్న వ్యాపారులు ఎక్సైజ్‌శాఖకు గుడ్‌విల్‌గా రూ.రెండు లక్షలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రతినెలా.. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డీటీఎఫ్ విభాగానికి ఏడాదికి రెండు విడతల్లో రూ.25 వేల చొప్పున ముట్టజెప్పాల్సి వస్తోంది. ఇక షాపులకు మద్యం సరఫరా చేసే డిపోలకు ఒక్కో బిల్లుకు రూ.200 నుంచి రూ.300 చొప్పున ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. అదనపు చెల్లింపులకు తోడు నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వెరసి గతంలో ఒక్కో దుకాణానికి సగటున 92 దరఖాస్తులు రాగా, ప్రస్తుతం మూడు, నాలుగుకు మించడం లేదు. ఎక్సైజ్ అధికారులు మాత్రం దీన్ని కొట్టిపారేస్తున్నారు. మరో వారం గడువుందని, ఆఖరి నిమిషంలో వచ్చే దరఖాస్తులే ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

18తో ముగియనున్న గడువు

నూతన మద్యం పాలసీ ప్రకారం శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్‌లోని మూడు స్టేషన్ల పరిధిలో మొత్తం 111 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో శంషాబాద్- 40, శేరిలింపల్లి-44, చేవెళ్ల-27 చొప్పున షాపులు ఉన్నాయి. సరూర్ నగర్ ఎక్సైజ్ యూనిట్‌లోని ఆరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 138 షాపులు ఉన్నాయి. వీటిలో సరూర్‌నగర్- 32, హయాత్‌నగర్-28, ఇబ్రహీంపట్నం-19, మహేశ్వరం -14, ఆమనగల్లు- 17, షాద్‌నగర్-28 షాపులు ఉన్నాయి. దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. బీసీ గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు ఐదు శాతం చొప్పున కేటాయించారు. వీటికి సంబంధించిన దరఖాస్తులను బండ్లగూడ జాగీర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అకాడమీ (ఈస్ట్)లో స్వీకరిస్తున్నారు. లిక్కర్ షాపు కావాల్సిన వ్యాపారులు స్వయంగా వచ్చి వారి అప్లికేషన్లు సంబంధిత కౌంటర్లలో అందజేయాల్సి ఉంది. ఈనెల 18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా నిర్ణయించారు. ఆయా దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 23న లాటరీ నిర్వహించనున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

ఫిర్యాదుతో స్పందించిన మున్సిపల్ అధికారులు



దిమ్మెలను కూల్చేసిన మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి మార్గంలో ఎలాంటి అనుమతులు లేకుండా.. పలు మాంసం దుకాణాలు వెలిశాయి. వీటి వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొంటూ.. ఇటీవల పలువురు మున్సిపల్ కమిషనర్ యాదగిరికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు.. జేసీబీ సహాయంతో ఆ షాపులను నేలమట్టం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కక్షపూరితంగానే దుకాణాల ఎదుట నిర్మించిన దిమ్మెలను కూల్చేశారని యజమానులు ఆరోపించారు. పట్టణంలో అనేక ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇదే విషయమై కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా రవాణాకు ఇబ్బందికరంగా ఉన్న ఎలాంటి నిర్మాణమైనా కూల్చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టరాదని సూచించారు.

సీజేఐపై దాడి యత్నం అనాగరికం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అనంతగిరి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి అనాగరికమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ అన్నారు. సమితి, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయాన్ని కాపాడే వారిపై ఇలాంటి దాడులు జరిగితే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్, ఆయన వెనక ఉన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, కృష్ణ, నర్సింహులు, సుభాష్ డప్పు మహేందర్, పుష్పరాణి, సునిత తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు జవాబుదారీగా ఉండాలి



మొక్కకు నీరు పోస్తున్న తపాలా సిబ్బంది

తుక్కుగూడ: ఖాతాదారులకు జవాబుదారీగా ఉండాలని తపాలా శాఖ ఏఎస్పీ జోయల్ అన్నారు. శుక్రవారం పుర పరిధి మంఖాల్ పోస్టాఫీస్‌ను ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తపాలా కార్యాలయం ద్వారా తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కలిపిస్తుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయా లని సిబ్బందికి సూచించారు. కార్యాలయానికి వచ్చే లేఖలు, వివిధ పత్రాలను సకాలంలో ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ తపాల దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాఖ ఎస్‌పీఎం నవీన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ నజర్

రూ.18 లక్షల సరుకు స్వాధీనం చేసుకున్న టీమ్

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కన్నేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నగర వ్యాప్తంగా నిఘా ముమ్మరం చేశారు. ఫలితంగా ఈస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి రూ.18 లక్షల విలువైన సరుకు చిక్కినట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. బొగ్గులకుంటకు చెందిన శ్యామ్ కుమార్ సుగంధి సిద్ధ అంబర్‌బజార్‌లో ఓ గోదాం నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు, ముందు జాగ్రత్త చర్యలు లేకుండా అందులో భారీగా బాణాసంచా నిల్వ ఉంచారు. జనావాసాల మధ్య ఈ గోదాం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా అతడు నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. నగర వ్యాప్తంగా ఉన్న బాణాసంచ అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొన్ని రోజులుగా ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈస్ట్‌జోన్ బృందానికి శ్యామ్ కుమార్ గోదాంపై సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ నేతృత్వంలో ఎస్సైలు ఎం.అనంతాచారి, ఎస్.కరుణాకర్‌రెడ్డి, పి.నాగార్జున తమ బృందాలతో దాడి చేసి శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం రూ.18 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకుని కేసును అఫ్జల్ గంజ్ పోలీసులకు అప్పగించారు.